జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 20 | మార్చి | 2025 ◆ పేజీలు : 6

# శ్రీరామనవమికి వచ్చే భక్తులందరికి తలంబ్రాలు, ప్రసాదం అందాలి :: కలెక్టర్

- వేసవి దృష్ట్యా చలువ పందిళ్లు, తాగునీరు ఎక్కువ చోట్ల అందుబాటులో ఉంచాలి
- అధికారులంతా సమన్వయంతో పని చేయాలి
- శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించి సమీక్షించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



2 లో...



# నెలల తరబడి... కాలయాపన !

2 లో..

- 200లకు పైగా దరఖాస్తుల పెండింగ్
- గత కొన్ని నెలల క్రితం వైరింగ్ సరిగా లేక కరెంట్ షాక్ కొట్టిన వైనం?
- వైరింగ్ బాగ లేదని సంబంధిత అధికారులపై కార్మికుల ఆగ్రహం !
- పర్చేస్ విభాగం నుంచి ఆర్డర్ రాక పోవడమే కారణమా?
- మరమ్మత్తులు చేస్తున్న సంబంధిత అధికారులు
- పూర్తిస్థాయిలో వైరింగ్ చేయాలని కార్మికుల డిమాండ్



# గిరిజన మ్యూజియంను విద్యుత్తు కాంతులతో అలంకరించాలి: పీవో

**భద్రాచలం, మార్చి 19, ప్రజాజ్యోతి :** గిరిజన మ్యూజియం అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి విద్యుత్తు కాంతులతో అందంగా అలంకరించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో మ్యూజియంను సందర్శించి బోటింగ్ ప్రదేశాలు, బాక్స్ క్రికెట్ గ్రౌండ్, మ్యూజియం లోపల చిత్రీకరణ జరుగుతున్న పెయింటింగ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి దగ్గర పడుతున్నందున శ్రీ సీతారాముని కల్యాణ వేడుకలు తిలకించడానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా గిరిజన మ్యూజియంను సందర్శించే విధంగా సన్నాహాలు చేస్తున్నందున ఏ ఒక్క పని మిగలకుండా పూర్తి చేయాలన్నారు. అలాగే మ్యూజియంలో వాష్రూమ్స్, టాయిలెట్లు ఏమైనా రిపేర్లు ఉంటే చేయించాలని అన్నారు. అనంతరం గిరిజన కల్చర్కు సంబంధించిన పెయింటింగ్ చిత్రాలను ఆయన పరిశీలించారు. ఈకార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, ఈఈ మణెమ్మ, ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్ , ఏసీఎంవో రమణయ్య, డీఈ హరీష్, డీఎస్వో ప్రభాకర్రావు పాల్గొన్నారు.

# కీచక ఉపాధ్యాయుడు

- విద్యార్థినిల పట్ల అసభ్య ప్రవర్తన
- దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు, గ్రామస్తులు
- కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

2 లో..



# జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ

- బీజేపీ జిల్లా నూతన అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి.

**భద్రాచలం టౌన్, మార్చి 19, ప్రజాజ్యోతి:** భారతీయ జనతా పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి బుధవారం భద్రాచలం విచ్చేయగా, భద్రాచలం నియోజకవర్గం బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్థానిక బ్రిడ్జి సెంటర్ వద్ద పూలమాలలు, పుష్ప గుచ్చాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారిని దర్శించుకున్న తరువాత స్థానిక రెడ్డి సత్రంలో జరిగిన

మిగతా 2 లో...



# నెలల తరబడి కాలయాపన !

**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల పట్ల అధికారులు వివక్షత చూపుతున్నారని, కార్మికులు నివాసం ఉండే క్వార్టర్లలో సుమారుగా సంవత్సరం నుండి ఎలాంటి వైరింగ్ పనులు చేయక పోవడంతో ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ఎదురుచూస్తున్నారు. ఇప్పటివరకు సుమారుగా 200లకు పైగా దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయని పక్కా సమాచారం. తమ క్వార్టర్లలో వైరింగ్ (ఎలక్ట్రికల్) సమస్య ఉందని కార్మికులు దరఖాస్తు చేసినా కానీ నేటి వరకు ఆ ప్రక్రియ ముందుకు సాగడం లేదనే విమర్శలు ఉన్నాయి. సంస్థ అభివృద్ధి కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. ఇలా క్వార్టర్లలో వైరింగ్ సమస్య ఉండడం ఎప్పుడు ఎలాంటి ఘటన జరుగుతుందో అర్థం కాని పరిస్థితులలో కార్మికులు ఉన్నారన్నది వాస్తవం. గత కొన్ని నెలల క్రితం ఓ క్వార్టర్స్ లో వైరింగ్ సమస్య వల్ల ఒకరికి విద్యుత్ షాక్ కొట్టినట్లు తెలుస్తుంది. దీంతో కార్మికులు సంబంధిత విభాగ అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. క్వార్టర్లలో నూతన వైరింగ్ కోసం పర్చేస్ విభాగం నుంచి ఎలాంటి అనుమతులు రాకపోవడం వల్లనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సంబంధిత వర్క్ షాప్ అధికారులు క్వార్టర్లలో ఉన్న వైరింగ్ నే మరమత్తులు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం మాత్రం కావడం లేదని కార్మికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఏరియా ఉన్నతాధికారులు స్పందించి ఎలాంటి హాని జరగక ముందే పెండింగ్ లో ఉన్న 200 దరఖాస్తులలోని క్వార్టర్లలో వైరింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

### అధిక ధరకు టెండర్ వేయడం వల్లనే రద్దు..?

పర్చేస్ విభాగంలో క్వార్టర్లలో వైరింగ్ కు ఎల్ 1 టెండర్ లో గతంలో కంటే ప్రస్తుతం ఎక్కువ ధరకు టెండర్ వేస్తే ఆ టెండర్ ను రద్దు చేస్తున్నట్లు సమాచారం. ఇలా టెండర్ల రద్దు వల్లనే క్వార్టర్లలో వైరింగ్ పనులు ఆలస్యం అవుతున్నట్లు స్పష్టమవుతుంది. సంబంధిత వర్క్ షాపు అధికారులు ఉన్నతాదికారుల దృష్టికి తీసుకువెళ్లిన కానీ క్వార్టర్లలో వైరింగ్ పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. ఇలా క్వార్టర్లలో వైరింగ్ పెండింగ్ పడడం వల్ల ఒకేసారి టెండర్ అనుమతి ఇస్తే వర్క్ షాపు సిబ్బంది కొంత ఇబ్బందులు పడే అవకాశం లేకపోలేదు. గతంలో క్వార్టర్లలో వైరింగ్ కోసం 2 సార్లు టెండర్ వేసి రద్దు చేయడం వల్ల వైరింగ్ పనులు ప్రారంభం కాకపోవడం వల్ల కార్మికులు వర్క్ షాపు అధికారులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తుంది. ఇలానే మరింత కాలయాపన చేస్తే మరిన్ని దరఖాస్తులు పెరిగే అవకాశం లేకపోలేదనేది వాస్తవం.

# కీచక ఉపాధ్యాయుడు

**టేకులపల్లి, మార్చి19, ప్రజాజ్యోతి:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత స్థాయిలో నిలుపాల్సిన ఉపాధ్యాయుడే తన వక్ర బుద్ధిని చాటుకున్నాడు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన ఆ పంతులు తన మానవతాన్ని మరిచి ప్రవర్తించాడు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించాల్సిన ఉపాధ్యా యుడే కామాంధుడిగా మారిన ఉదంతమిది. మండలంలోని సంపత్ నగర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన చోటుచేసుకుంది .స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గత మూడు రోజులుగా 9వ తరగతి చదువుతున్న ఓ బాలికపై పాఠాలు నేర్పే ఉపాధ్యాయుడు చెయ్యి వేసి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని బాలిక తల్లిదండ్రులకు తెలిపిందన్నారు. దింతో విద్యార్థిని తల్లిదండ్రులు, గ్రామస్తులు కలిసి ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై వచ్చినా అభం శుభం తెలియని బాలికపై కన్నేసాడని గ్రామస్తులు ఆరోపించారు. తండ్రి వలే సమాజంలో ఎలా బతకాలని, పోటీ ప్రపంచంలో పోటీ పరీక్షలు ఎలా రాయాలో.. ప్రభుత్వ ఉద్యోగాలు ఎలా సాధించాలో చెప్పాల్సిన గురువే కీచకుడిగా మారి సభ్య సమాజానికి మాయని మచ్చగా మారాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమాజంలో ఏదో ఒక చోట మహిళలు, విద్యార్థినిలపై రోజురోజుకూ అఘాయిత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన విద్యార్థినిలపై కన్నేస్తున్న కొంత మంది ఉపాధ్యాయులు వారిని లొంగతీసుకునేందుకు యత్నిస్తుండటం సమాజానికే మాయని మచ్చగా తయారవుతుంది. జిల్లాలో ఈ మధ్య కాలంలో ఎక్కువయ్యాయి. ఉపాధ్యాయుల రూపంలో కీచకుల మధ్యలో అన్నెం పున్నెం ఎరుగని విద్యార్థినిల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతుండడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా వారికి మాత్రం రక్షణ లేకుండా పోతుందంటున్నారు.




చదువు నేర్పే గురువులను బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరులతో పోల్చుతారు. విలువలు నేర్పే గురువుకు సమాజంలో ఎంతో గౌరవ మర్యాదలు లభిస్తాయి. విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు సభ్యత, సంస్కారం, సంప్రదాయం, నైతిక విలువలు నేర్పే మహోన్నత వ్యక్తిగా చూస్తారు. అలాంటి గురువులు నీతి తప్పుతున్నారు. వారిలో నిద్రాణమై ఉన్న కామ పిశాచిని నిద్రలేపుతున్నారు. తమ సంరక్షణలో ఉండి చదువుకునే విద్యార్థినులను కన్న బిడ్డల్లా చూడాల్సి ఉన్నా, వారిలో ఆడతనాన్ని ఆశగా చూస్తున్నారు.. ఆశపడుతున్నారు. వంకర బుద్ధులను ప్రదర్శిస్తున్నారు. విద్యార్థినిలను లైంగికంగా వేధిస్తున్నారు. లైంగికంగా వేధింపులు బయటకు పొక్కకుండా లోలోపలే దాచేసే ప్రయత్నాలు జరిగినా తల్లిదండ్రులు గట్టిగా ఫైట్ చేయడంతో పోలీస్ కేసుల వరకు వెళ్లింది. చివరకు బాలిక తల్లిదండ్రులు బోడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ పి. శ్రీకాంత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




## శ్రీరామనవమికి వచ్చే భక్తులందరికి తలంబ్రాలు, ప్రసాదం అందాలి..





**భద్రాచలం, మార్చి 19, ప్రజాజ్యోతి:** శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వచ్చే ప్రతి భక్తునికి తలంబ్రాలు, ప్రసాదం అందించే విధంగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. భద్రాచలంలో శ్రీరామనవమి ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ పరిశీలించడంతో పాటు ఏర్పాట్ల పురోగతిపై అధికారులతో చర్చించారు. భక్తులకు వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇరిగేషన్ శాఖ ద్వారా కల్యాణ మండపంలోని భక్తులకు, కల్యాణ మండపం బయట ఉండే భక్తులకు పాలిహౌజ్లు ఏర్పాట్లు చేస్తున్నామని, కరకట్ట పక్కన తక్కువ ఖర్చుతో భక్తులు బస చేయడానికి క్యాంపు ఫైడ్ హౌజ్ లు ఏర్పాటు చేశామని అన్నారు. ఎండాకాలం వస్తున్నందున భక్తులు వారు బస చేసే ప్రాంతం కల్యాణ మండపానికి రావడానికి రవాణ సౌకర్యం కల్పిస్తున్నామని కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. అనంతరం భక్తులకోసం చేపడుతున్న టాయిలెట్లు, వాష్రూములు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దామోదర్ రావు, దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా బీజేపీ

(మొదటి పేజీ తరువాయి...)

ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో బీజేపీ పార్టీ జూనియర్, సీనియర్ నాయకులను, కార్యకర్తలను ఎలాంటి తారతమ్యం భేదాలు లేకుండా కలుపుకుంటూ పార్టీని బలపరుస్తూ, కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయ శక్తిగా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కథ సమాప్తమయిందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రస్తుతం ఉన్న ముగ్గురు మంత్రులు ఎలాంటి ప్రత్యేక విధులు, నిధులు జిల్లా కోసం తీసుకురాకపోగా, పాత పనులకు కమీషన్లు వసూలు చేస్తూ, అవినీతికి పరాకాష్టగా మిగిలారని, ఈ రెండు పార్టీలతో విసిగి నలిగిన జిల్లా ప్రజలు భారతీయ జనతా పార్టీని భవిష్యత్తు దిక్సూచిగా చూస్తున్నారని, దానికి ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికలలో పెరిగిన ఓట్ల శాతం నిదర్శనమని అన్నారు.అలాగే బీజేపీ కేంద్ర ప్రభుత్వం కూడా జిల్లాలో రైల్వే లైన్ నిర్మాణానికి, భద్రాద్రి రామాలయానికి, గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తున్న విషయం కూడా అందరికీ విదితమే అన్నారు.ఈ సందర్భంగా రానున్న ఏప్రిల్ 6 పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున జిల్లాలో పోలింగ్ బూతు స్థాయిలో జెండాలు ఎగిరి వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మ, బీజేపీ సీనియర్ నాయకులు త్రినాథ రావు, ములిశెట్టి రామ్మోహన్ రావు, పసుమర్తి సతీష్, రఘురాం, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు బిట్రగుంట్ల క్రాంతి కుమార్, బీజేపీ భద్రాచలం, చర్ల మండల అధ్యక్షులు ముత్యాల శ్రీనివాసరావు, నూపా రమేష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ నిడదవోలు నాగబాబు, మహిళా మోర్చా నాయకులు ముక్కెర కోటేశ్వరి, పట్టణ కమిటీ నాయకులు చెల్లుబోయిన వెంకన్న, యువ మోర్చ నాయకులు ములిశెట్టి నిఖిల్, అన్నెం సాయి లక్ష్మన్, అన్నం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల సాధనకై పోరాటాలు చేపడతాం : హెచ్‌ఎంఎస్



**కొత్తగూడెం సింగరేణి, మార్చి 19, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం ఏరియా పి వి కే ఫై మైన్ నందు పిట్ సెక్రెటరీ చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ అధ్యక్షతన కార్మికుల సమస్యల సాధన కోసం కార్మికుల వద్దకు హెచ్‌ఎంఎస్ అనే నినాదంతో నాయకులు సెకండ్ షిఫ్ట్ కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకొని వారికి న్యాయబద్ధంగా పొందవలసిన హక్కులను వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ మాట్లాడుతూ గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల వైఖరి వల్ల కంపెనీ మొత్తం ప్రైవేటు వారికి ధారపోసే విధంగా ఉందని దాన్ని అడ్డుకోవాల్సిన బాధ్యత మన అందరి మీద ఉందని అన్నారు. ముసలి కన్నీరు కార్చే గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు నిజంగా కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే వీకే ఓసి గురించి చేస్తున్న ప్రచారాలు పక్కనపెట్టి స్ట్రైక్ నోటీస్ మేనేజ్మెంట్కు అందజేస్తే తాము కూడా మద్దతు పలికే వారిమని కానీ కేవలం వారి ఉనికి కోసం కార్మికుల ముందు పోరాటం చేస్తున్నట్టు నటించడం కోసం మాత్రమే చేస్తున్న చర్యలు తప్పించి మరేమీ లేదని తేల్చి చెప్పారు. ఒకవైపు కాంట్రాక్టు వ్యవస్థను ప్రోత్సహిస్తూ మరోవైపు వ్యతిరేకమని రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తున్న సంఘాల వైఖరిని ఎండబకట్టడం జరిగిందని, ఎలక్షన్స్ అప్పుడు చెప్పిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో పరిష్కరించ లేదు కానీ స్ట్రక్చర్ మీటింగ్లలో అది చేస్తాం ఇది చేస్తామని చెప్పిన సంఘాలు ఈరోజు వరకు కూడా ఒక స్పష్టమైన అగ్రిమెంట్ చేయలేదు. అంతేకాకుండా ప్రైవేటు క్యాంటీన్లను ఏర్పాటు చేయడం ఓసీలలో సర్ఫేస్ మైనర్ లను అంగీకరించడం, అండర్ గ్రౌండ్లలో ప్రైవేట్ కంపెనీలకు బొగ్గు తీసే పనిని అప్పగించడం, ఇలాంటి చర్యలు ప్రోత్సహించేటటువంటి సంఘాలు చేస్తున్న చర్యలను కార్మికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పి వి కె 5 ఫీట్ సెక్రెటరీ చిట్టిబాబు, ఏరియా బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్, ఏరియా ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజశేఖర్, బ్రాంచ్ కమిటీ కన్వీనర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు పూర్తి

- ఆనందంలో విద్యార్థులు



**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు బుధవారంతో ముగిసాయి. విద్యార్థులు ఎంతో శ్రద్ధగా చదివి పరీక్షలను రాయడం జరిగింది. పరీక్షలు పూర్తవడంతో విద్యార్థులు వారి స్నేహితులతో కలిసి ఆనందాన్ని వ్యక్తం చేశారు. మరల ద్వితీయ సంవత్సర తరగతుల సమయంలో కలుసుకుందామని, మొదటి సంవత్సరంలో జరిగిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేసుకున్నారు.

## చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య



**బూర్గంపహాడ్,మార్చి 19, ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంప హాడ్ మండలం ముసలమడుగు బ్రిడ్జ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న బూర్గంపహాడ్ ఎస్ఐ రాజేష్ సంఘటన స్థలానికి చేరుకొని చెట్టుకు ఉరి వేసుకున్న వ్యక్తిని స్థానికుల సహాయంతో కిందికి దించి భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని ఆచూకీ తెలిస్తే సెల్: 8712682055 నెంబర్ కు తెలియజేయాలని ఎస్సై రాజేష్ తెలిపారు.

## ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ వ్యక్తి మృతి





**టేకులపల్లి, మార్చి 19, ప్రజాజ్యోతి :** రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతారాంపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టడం వల్ల టేకులపల్లి వైస్ ఎంపీపీ ఉండేటి ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు అని ఎస్ఐ పోగుల సురేష్ తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## ప్రతి కొనుగోలు వస్తువుపై రసీదు తప్పనిసరి

- జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి



**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** వినియోగదారుడు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి కోరారు. ప్రభుత్వ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహంలో బుధవారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇల్లందు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలు తెలిసి ఉండాలన్నారు. ప్రతి వస్తువుపై తయారీ తేదీ, ముగింపు తేదీ చూసుకోవాలని, ఆన్లైన్ లో మోసాలు జరుగుతున్నందున ఆన్లైన్ వస్తువులపై కూడా రసీదు తీసుకోవాలని సూచించారు. రసీదు తీసుకోవడం వలన మనకు జరిగిన నష్టాన్ని కన్స్యూమర్ ఫోరంలో కేసు వేసి కంపెనీ దారులపై చర్యలు తీసుకొని నష్టపరిహారం పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ సునీత, విద్యార్థినిలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**బూర్గంపహాడ్, మార్చి 19, ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినులకు పిఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్ష సామాగ్రిని పంపిణీ చేశారు. మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరెడ్డి చేతుల మీదుగా విద్యార్థినిలకు ప్యాడ్స్, పెన్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యనభ్యసించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పదో తరగతితోనే చదువులు నిలిపివేయకుండా ఉన్నత విద్యలను అభ్యసించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలని పిలుపునిచ్చారు.పిఎస్ఆర్ యూత్ నాయకులు బాదం మణికంఠారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బెల్లంకొండ వాసు, కాటం వెంకటరామిరెడ్డి, ప్రభాకర్ యాదవ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల ఏర్పాట్లలో హెచ్ ఎం

- దగ్గరుండి పనుల పర్యవేక్షణ
- విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దనే ఆకాంక్ష





**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** ఈ నెల 21 నుంచి 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష కేంద్రంలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడవద్దని బుధవారం పట్టణంలోని జెబిఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. లలిత మౌలిక వసతుల ఏర్పాటులో నిమగ్నమయ్యారు. మరుగుదొడ్లు, వాటర్, పరిసరాల శుభ్రతను దగ్గరుండి పర్యవేక్షించారు. తమ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 200 మంది పరీక్షలు రాయనున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో మంచినీరు, మరుగుదొడ్లు, మెడికల్ సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## కారుణ్య నియామక ఉత్తర్వుల అందజేత



**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా నుండి కారుణ్య నియామకాల్లో భాగంగా మెడికల్ అన్ఫిట్, డెత్ కార్మికుల వారసులకు బుధవారం జిఎం కార్యాలయంలో ఏరియా జిఎం వి. క్రిష్ణయ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ సింగరేణిలో ఉద్యోగం రావడం అదృష్టంగా భావించాలని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. భూగర్భ గనుల్లో పనిచేస్తే నైపుణ్యత పెరుగుతుందని, పని ప్రదేశంలో ఎల్లప్పుడూ రక్షణతో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తూ, సంబంధిత అధికారులు తెలిపిన, రక్షణ సూత్రాలు నిత్యం పాటిస్తూ సంస్థ పురోగాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఉద్యోగంలో చేరిన యువత ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పనిలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సింగరేణిలో ఉద్యోగాలు వారసత్వంగా అందించిన తల్లిదండ్రులు, కుటుంబాన్ని పోషించాలన్నారు. రామగుండం-1 ఏరియా భూగర్భ గని, ఇల్లందు ఏరియాలో పనిచేయుటకు నియామక ఉత్తర్వులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జిఎం రామస్వామి, డిజిఎం (పర్సనల్) జివి. మోహన్ రావు, ఫైనాన్స్ మేనేజర్ మధుబాబు, సీనియర్ పర్సనల్ అధికారి కె. సాయి స్వరూప్, ప్రాతినిధ్య సంఘ ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, గుర్తింపు సంఘం నాయకుడు సుందర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రేమ జంటకు రక్షణ కల్పించండి



**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం క్యాంప్ తండాకు చెందిన ధరావత్ మమత, పట్టణంలోని ఇల్లందులపాడుకు చెందిన కందిపాటి తరుణ్ ప్రేమ వివాహం చేసుకున్నారని, వారికి రక్షణ కల్పించాలని మాదిగ మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు వంగూరి దేవమ్మ బుధవారం పోలీస్ అధికారులను కోరారు. అమ్మాయి కుటుంబ సభ్యులు ఇద్దరికి హాని తలపెట్టడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. కులాంతర వివాహం చేసుకున్నందుకు అమ్మాయి తరపు కుటుంబ సభ్యులు కక్ష పెంచుకున్నారని తెలిపారు.

## సకాలంలో సర్టిఫికెట్లు జారీ చేయాలి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్



**బూర్గంపహాడ్, మార్చి19, ప్రజా జ్యోతి :** ఓటర్ల సవరణ జాబితా,గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు, యువతి యువకులకు వివిధ రకాల సర్టిఫికెట్లు జారీ విషయంలో జాప్యం లేకుండా సకాలంలో అందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. బుధవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల సవరణ జాబితా ప్రక్రియను ఆయన పరిశీలించి, ఓటర్ సవరణ జాబితా రివిజన్ ఏవిధంగా జరుగుతున్నదని తహశీల్దార్ ని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 ద్వారా నూతనంగా ఓటు హక్కు రిజిస్ట్రేషన్ చేసుకునేలా చూడాలని, ఫామ్ 7 ద్వారా తొలగించాలని, అభ్యంతరాలపై దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఫామ్ 8 ద్వారా తప్పుల సవరణ, ఫోటో మార్పు, ఓటు తరలింపు ప్రక్రియ చేపట్టాలని, ఓటర్లు నూతన ఓటు హక్కు రిజిస్ట్రేషన్ మార్పులు చేర్పులు తదితర సేవలకు ఎక్కడకు తిరిగే అవసరం లేకుండా బిఎల్ఓ యాప్ ద్వారా అన్ని సేవలు చేసుకోవచ్చని ఓటర్లకు సిబ్బంది తెలియజేయాలని ఆయన అన్నారు. అలాగే నిరుద్యోగ యువకులకు ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినందున తప్పనిసరిగా కులం సర్టిఫికెట్లు, ఆదాయం సర్టిఫికెట్లు, నివాసం ఇతర సర్టిఫికెట్లు అవసరం ఉంటుందని, ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే జాప్యం చేయకుండా సకాలంలో అందించాలని అన్నారు. మండలంలో ఇసుక రీచ్ లు ఉన్న ఎలాంటి అనుమతులు లేకపోవడంతో ఇసుక కొరత ఉన్నదని అక్రమ రవాణా జరగకుండా తమ సిబ్బందిని ఇసుక ర్యాంపుల వద్ద 24 గంటలు కాపలా ఉంచడం జరుగుతుందని, తమ సిబ్బందిలో కొంతమందిని ఐటిసి గెస్ట్ హౌస్ వద్ద ఉండాల్సి వస్తుందని అన్నారు. సర్టిఫికెట్లు విషయంలో జాప్యం లేకుండా పూర్తి చేయటానికి కృషి చేస్తున్నామన్నారు. ఓటర్లు సవరణ ప్రక్రియ పూర్తవుతుందని బూర్గంపాడు తహసిల్దార్ ముజాహిద్ ఐటీడీఏ పీవో కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నరసింహారావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా

- బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్లకు 18 వేలు ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలి
- మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల వేతనం ప్రకటించాలి
- సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజె రమేష్







**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 19, ప్రజా జ్యోతి :** అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో ఆశా వర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం 18000 ఫిక్స్డ్ వేతనం నిర్ణయించాలని, అదేవిధంగా ఆశా వర్కర్లకు రూ 10,000 వేతనం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజె రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, టిఆర్ఎస్ నడిచిన బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పయనిస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని ఆశాలకు వేతనాలు పెంచడం తో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిందని, ఆశా వర్కర్ల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారి సమస్యలు మాత్రం పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించి వారికి రూ 18000 ఫిక్స్డ్ వేతనం ఇచ్చే విధంగా అసెంబ్లీలో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ఇస్తామన్న రూ 10,000 వేతనం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మికుల జిల్లా కార్యదర్శి ఎండి సుల్తానా, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవికుమార్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే సత్య, వీరన్న, అర్జున్ సిఐడి జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నిమ్మల మధు, మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా నాయకులు వెంకట నరసమ్మ, ఈశ్వరమ్మ, నాగ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# 6 గ్యారంటీలకు పాతరేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉంది

- తెలంగాణ బడ్జెట్‌పై లక్ష్మీదేవిపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్




**లక్ష్మీదేవిపల్లి, మర్చి 19, ప్రజాజ్యోతి :** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే.. డొల్ల అని తేలిపోయిందని బిజెపి మండల అధ్యక్షుడు మాలోత్ గాంధీ నాయక్ విమర్శించారు . బడ్జెట్ తీరును విశ్లేషిస్తే.. అబద్దాలు.. అంకెల గారడీ.. 6 గ్యారంటీలకు పాతరేసేలా రాష్ట్ర బడ్జెట్ ఉందని, ఓం భూం బుష్ అంటూ మాయ చేసేందుకే ప్రయత్నిస్తున్నట్లు స్పష్టంగా కన్పిస్తోందని ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా గత బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులను పరిశీలిస్తే పొంతనే లేదని, అయినప్పటికీ బడ్జెట్ కేటాయింపులు పెంచి రాష్ట్ర ప్రజలను దారుణంగా మోసం చేసేందుకు బడ్జెట్‌ను సాధనంగా చేసుకోవడం సిగ్గుచేటన్నారు. 6 గ్యారంటీలను పూర్తిగా తుంగలో తొక్కేశారని ఆరోపించారు. ఎన్నికలకు ముందు మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా పేర్కొన్న కాంగ్రెస్ నేతలు అధికారంలోకి వచ్చాక చిత్తుకాగితంగా మార్చినట్లు ఈ బడ్జెట్ ద్వారా వెల్లడైందన్నారు. తెలంగాణ ప్రజల తలసరి ఆదాయం భారీగా పెరిగినట్లు బడ్జెట్‌లో గొప్పలు చెప్పిన సర్కార్.. అప్పుల వివరాలను కూడా బడ్జెట్ లో పొందుపరిచి ఒక్కో తెలంగాణ పౌరుడిపైనా, చివరకు పుట్టబోయే బిడ్డపైనా ఎంత అప్పు భారం ఉందో వాస్తవాలను వివరిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు. మహిళలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ గత బడ్జెట్ లోనూ, ఈ బడ్జెట్‌లోనూ నయాపైసా కేటాయించలేదన్నారు. 2 లక్షల ఉద్యోగాల భర్తీ, రూ.4 వేల నిరుద్యోగ భృతిపై బడ్జెట్‌లో కేటాయింపులు జరపకపోవడం సిగ్గు చేటు అని తెలిపారు. ఇక విద్యా భరోసా ప్రస్తావనే లేదని, వృద్ధుల పెన్షన్ పెంపును ప్రస్తావించకుండా వారిని గాలికొదిలేసిందని అన్నారు. బడ్జెట్ కేటాయింపులకు, ఆచరణకు అసలు పొంతనే లేదన్నారు. గత(2024-25) ఆర్థిక సంవత్సరంలో 2 లక్షల 91 వేల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆచరణలోకి వచ్చేసరికి రూ.2 లక్షల కోట్లు కూడా ఖర్చయినా దాఖలాల్లేవని తెలిపారు. అబద్దాల్లో, అంకెల్లో.. కోతలు కోయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ సర్కార్ ను మించిపోయిందని విమర్శించారు. గతం లో దళిత బంధు పేరుతో కేసీఆర్ ప్రభుత్వం 2023లో రూ.17 వేల కోట్లకు పైగా కేటాయించినా.. ఆచరణలో మాత్రం నయా పైసా ఖర్చు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిన నడుస్తోందేని, గత బడ్జెట్‌లో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున నిర్మిస్తామని పేర్కొంటూ ఇందిరమ్మ ఇండ్ల కోసమే రూ.7,500 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఆచరణలోకి వచ్చే సరికి నయా పైసా ఖర్చు చేయలేదు ఒక్క ఇల్లు కూడా కట్టియ్యలేదు.. అని పేర్కొన్నారు. బడ్జెట్ కేటాయింపులను చూస్తే.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకంటే మైనారిటీలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమైనట్లుగా తేట తెల్లమైందని ఆరోపించారు. విద్య, వైద్య రంగాల కేటాయింపులు దారణమని, రైతుకిచ్చిన హామీలన్నీ హుష్ కాకి అయ్యాయని విమర్శించారు.బడ్జెట్ తీరు తెన్నులను విశ్లేషిస్తే కాంగ్రెస పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడి తప్పినట్లు కన్పిస్తోందని, ఆదాయ, వ్యయాలను చూస్తుంటే అప్పులు చేయడం, ఆస్తులు అమ్మడం తప్ప మరో మార్గం లేదన్నట్లుగా కాంగ్రెస్ పాలన మారిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఏటా రూ.67 వేల కోట్ల అప్పు చేస్తే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 15 నెలల్లోనే రూ.1.58 లక్షల కోట్లు అప్పు తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా 6 గ్యారంటీల అమలు కోసం ఈ బడ్జెట్ లో కేటాయింపులను చేసేలా సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులకు, వాస్తవిక ఖర్చు వివరాలతో పాటు కాంగ్రెస్ సర్కార్ గతేడాది బడ్జెట్ కేటాయింపులు, వాస్తవిక ఖర్చు వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.

## రాజీవ్ యువ వికాస్ పథకంలో నిరుద్యోగ యువతకు చిక్కులు

- రేషన్ కార్డ్ లేకపోవడంతో అర్హత కోల్పోతున్న యువత
- ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలు మార్చాలి
- సేవలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్

**టేకులపల్లి,మార్చి19, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలో సేవాలాల్ సేన సమావేశం మండల అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సేవాలాల్ సేన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ పాల్గొని ఈ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులకు అవకాశం కల్పించకపోవడంతో 12 సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పెళ్లిళ్లు జరిగి వేరుగా నివాసం ఉంటున్న ఎందరో యువకులు ఇంకా తల్లిదండ్రులు రేషన్ కార్డులోనే కొనసాగుతూ ఉన్నారని వారు ఆరోపించారు. కానీ ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించడంతో నిబంధనలు ప్రకారం పాత రేషన్ కార్డులు డిలీట్ అయితేనే కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకునే పరిస్థితి ఉండడంతో పలువురు యువకులు డిలీట్ ఆప్షన్ ద్వారా పాత రేషన్ కార్డులు డిలీట్ అయ్యారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యువతకు చేయూతనందించేందుకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకొని వచ్చింది. ఎంతో ఆశగా శిక్షణతో పాటుగా సబ్సిడీ రుణాలు లభిస్తాయని ఉపాధి పొందవచ్చు అని ఆశతో ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవడానికి ఈ సేవా సెంటర్లకు వెళ్తే అక్కడ నిర్వాహకులు వివరాలు నమోదు చేసిన క్రమంలో రేషన్ కార్డ్ ఆప్షన్ వచ్చేసరికి ఇంతకుముందు పాత కార్డు డిలీట్ అయిన కారణంగా ఆ నెంబర్ కొడితే దరఖాస్తులు రిజెక్ట్ అవుతున్నాయని చెప్పడంతో యువకలు చాలా మంది నిరుత్సాహ పడుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సేవలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, బోడ శేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# కెటిసిలో సాగు భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

**టేకులపల్లి, మార్చి 19,ప్రజాజ్యోతి:** కెటిసీ 2,ఫిట్ –2,3లో సాగు భూములు కోల్పోయిన గిరిజన నిర్వాసితులకు గౌరవ హైకోర్టు తీర్పు ప్రకారం భూమి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయం ముందు భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన, ధర్నా నిర్వహించి, ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు,రేపాకుల శ్రీనివాస్ లు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలను ఉల్లంఘించి భూసేకరణ చేయడం వల్ల నిర్వాసితులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని అన్నారు. 2008 సంవత్సరంలో అటవీ హక్కుల చట్టాన్ని, ప్రభుత్వం, పర్యావరణ శాఖ ఇచ్చిన అనుమతిని



ఉల్లంఘించి కోయగూడెం ఓసీ 2,ఫిట్ 2,3 ప్రాజెక్టు కోసం 231.94 హెక్టార్ల పోడుసాగు భూములను టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం, కోయ గూడెం , దంతెలతండ, కొత్తతండ, జేత్యతండ గ్రామాల గిరిజనుల నుంచి బలవంతంగా గుంజుకున్నారని తెలిపారు. న్యాయం కోసం గిరిజన నిర్వాసితులు గౌరవ హైకోర్టును డబ్ల్యు పి నెంబర్ . 2835/2010,30758 /2010, ఆశ్రయించారన్నారు. 2011సం లో గౌరవ హైకోర్టు నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని ఆదేశించింది, దీంతో జిల్లా రెవెన్యూ, సింగరేణి అధికారులు పునరావాస ప్యాకేజీ నామమాత్రంగా చెల్లించినారని,భూమి నష్టపరిహారం అసలు ఇవ్వలేదని వారు అన్నారు. భూమి నష్టపరిహారం కోసం మళ్ళీ నిర్వాసితులు డబ్ల్యు పి నెంబర్12169/2016, 12214/2016కేసువేసినారన్నారు, 27/09/2024 న గౌరవ హైకోర్టు నిర్వాసితులకు నాలుగు వారాల్లో న్యాయం చేయాలని ఆదేశించింది. కానీ నష్టపరిహారం నేటికీ అందలేదు వారు ఆరోపించారు.వెంటనే హైకోర్టు తీర్పు అమలు చేసి భూమి నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, పూనెం స్వామి,పూనెం చంద్రశేఖర్, దొడ్డ సంపత్ కుమార్, దొడ్డ కోటేశ్వరరావు,చీమల క్రిష్ణ,బానోత్ వస్రాం, నరేష్, లక్ష్మి,ఈసం చుక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ నూరు శాతం అమలు చేయాలి

**వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ అందించాలి**

- **రైతాంగానికి ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేయాలి**
- **తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు**
- **పోడు సాగుదారులకు పట్టాలివ్వాలి**
- **రైతు ఉద్యమాలకు సంసిద్ధం కావాలి**
- **సీపీఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా**



**కొత్తగూడెం కలెక్టరేట్, మార్చి 19, ప్రజా జ్యోతి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వలన వ్యవసాయ రంగం దెబ్బతిని సంక్షోభంలో ఉందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని జగన్నాధపురం ముంతాజ్ ఫంక్షన్ హాల్ లో రైతు సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు, . ముందుగా రైతు సంఘం జెండాను భాగం హేమంతరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు అనుకూలంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి దొడ్డి దారిన అమలు చేయడా నికి ప్రయత్నం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. వ్యవసాయ రంగం దెబ్బతింటే అన్ని రంగాలు మీద నష్టాలు జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వాలు గమనించి స్వామినాధన్ సిఫార్సులు తక్షణమే అమలు చేసి రైతాంగ వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరారు. వ్యవసాయ రంగం బలంగా ఉంటేనే అన్ని రంగాలు బాగా ఉంటాయని తెలిపారు. పంటలు మద్దతు గ్యారెంటీ చట్టం అమలు చేస్తే తప్ప వ్యవసాయంలో రైతు నిలబడగలుగుతాడని పేర్కొన్నారు. రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా శక్తివంతమైన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు రుణమాఫీ రైతు భరోసా ఇస్తామని రైతులకు ఇచ్చిన హామీని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు ప్రాజెక్ట్ ప్రాధాన్యత కల్పించి పంటలకు సాగునీరు అందించే విధంగా పాలకులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులకు ఇచ్చేవారని గత పదిహేళ్లుగా టిఆర్ఎస్ ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేసిందని నేటి కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ యంత్రాలకు సబ్సిడీ ఇచ్చి రైతులకు యంత్రాలను అందించాలని కోరారు. అనాదిగా పోడు సాగు చేసుకుంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు ఇవ్వాల్సిందేనని, ఫారెస్ట్ అధికారులు కవ్వింపు చర్యలకు పాల్పడద్దని, రైతులు మూడు సాగుదారులు పట్ల గత ప్రభుత్వం వ్యవహరించిన విధంగానే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తే పోరాటాలు చేయక తప్పదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు చంద్ర నరేంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వర్లు, నారాటి ప్రసాద్, చంద్రగిరి శ్రీనివాస్, సలిగంటి శ్రీనివాస్, అడుసుమల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచంద్రరావు, భూక్యా దసురు, కుమారి హనుమంతరావు, బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, డీ సుధాకర్, ఎండి యూసుఫ్, వాకబోయిన రమేష్, వాడే లక్ష్మి, బిక్షం, నరాటి రమేష్, విజయలక్ష్మి, రవికుమార్, వేణు, ఇమ్మానియేల్, బానోత్ రంజిత్, కొంగర అప్పారావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, వైయస్ గిరి, చెన్నయ్య, నిమ్మల రాంబాబు, మన్నెం వెంకన్న, ఇట్టి వెంకట్రావు, అన్నారపు వెంకటేశ్వర్లు, బివి సత్యనారాయణ, ఆదినారాయణ, బిక్కులాల్, వేములపల్లి శ్రీనివాస్ రావు, జకరయ్య, ఆడకు పెద్ద వెంకటరామయ్య, వజ్ర వాసు, బాదవత్ శీను, లావుగా చందులాల్, భూక్యా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో యువతకు పెద్ద పీటం



**పాల్వంచ, మార్చి 19(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పది సంవత్సరాల కెసిఆర్ పాలనలో దగా పడ్డ తెలంగాణ యువత,నిరుద్యోగ యువతకుచేయూత నివ్వడానికి తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సరకాలంలోనే 65 వేల ప్రభుత్వ ఉద్యోగాలకు స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా 65 వేల మంది యువత ఉద్యోగ నియామక పత్రాన్ని అందుజేశారు అని వారు అన్నారు. ఇది దేశ చరిత్రలో ఏ రాష్ట్రం చరిత్రలో ఇంత పెద్ద ఎత్తున నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం జరలేదని మన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజపాలనలో మాత్రమే సాధ్యమైందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవీలాల్ నాయక్ తెలిపారు. అదేవిధంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనారిటీ కి చెందిన నిరుద్యోగ యువతకు చేయూతనివ్వాలని వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 6 వేల కోట్ల రూపాయలను కేటాయించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేసారు.అదే విధంగా రాబోయే రోజుల్లో 57,946 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టనుంది,200 ఎకరాల్లో అర్టిఫిషల్ ఇంటలిజెన్స్ సిటీ నిర్మించాబోతుందని భవన నిర్మాణం రంగంలో విద్యార్థులకు ప్రత్యేక కోర్సులు ప్రవేశ పెట్టడం అభినందనీయమని వారు ఈ సందర్భంగా తెలిపారు.

## బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి అడ్రస్ గల్లంతు

- **బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ.**



**భద్రాచలం, మార్చి 19, ప్రజాజ్యోతి :** రాష్ట్ర ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి అడ్రస్ గల్లంతైందని బీఆర్ఎస్ నియోజక వర్గ బాధ్యులు మానె రామకృష్ణ అన్నారు. బుధవారం మీడియాకు విడుద ల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఈ బడ్జెట్లో మొండి చేయి చూపారని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఆరు గ్యారంటీలు 420 హామీలు ఈ బడ్జెట్లో కనుమరుగయ్యాయని అన్నారు. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్ పెంపు హామీ ఏమైందని, మహిళలకు రూ.2,500, తులం బంగారం వంటి హామీలు బంగాళఖాతంలో కలిపారని, రైతుకు రూ.15 వేలు, రైతు భరోసా రైతు భీమా వంటి పథకాలకు గోవిందా గోవిందా అంటూ మంగళం పాడారని వాపోయారు. రైతులకు వ్యవసాయంకు సంబంధించి బడ్జెట్లో నిధులు సరిగా కేటాయించలేదని ఆరోగ్య శాఖను ఆనారోగ్యశాఖగా మార్చారని ఆరోపించారు.

## ఉగాది ఉత్సవాలకు పట్టు వస్త్రాలు సమర్పణ



**భద్రాచలం టౌన్, మార్చి 19, ప్రజా జ్యోతి :** భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసి ఆఫీస్ రోడ్ లో గల శ్రీ శివ ముత్యాలమ్మ అమ్మవారి ఉగాది ఉత్సవాల పురస్కరించుకొని పసుపులేటి శ్రీనివాసరావు ప్రభావతి దంపతులు అమ్మవారికి 25 వేల రూపాయలు విలువగల పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలు పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఆనవాయితీగా గొల్ల బజార్ వాస్తవ్యులు పసుపులేటి సూర్యారావు కుటుంబ సభ్యులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, గాజులు పువ్వులు సమర్పిస్తూ ఉంటారని, అదే ఆనవాయితీగా సంవత్సరం కూడా సమర్పించారని తెలిపారు.

## ఎస్ఐ ను సినిమానించిన బిఆర్ఎస్ శ్రేణులు



**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** ఇటీవల విడుదల చేసిన గ్రూప్ 1 ఫలితాలలో ఇల్లందు ఎస్సై గా విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్ అత్యున్నత ప్రతిభ కనబరిచి 502 మార్పులు సాధించినందుకు గాను బుధవారం బిఆర్ఎస్ శ్రేణులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ ఎస్సైగా తన విధులు నిర్వహిస్తూ గ్రూప్ 1 పరీక్షలు రాసి ఆర్డిఓ, డీఎస్పీ ఉద్యోగం సాధించే స్థాయికి చేరుకోవడం సంతోషకరమన్నారు. సందీప్ కుమార్ ఇదే పట్టుదలతో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెకె శ్రీనివాస్, సిలివేరి సత్యనారాయణ, ఎస్. రంగనాథ్, జాఫర్ హుస్సేన్, పరుచూరి వెంకటేశ్వర్లు, అబ్దుల్ నబీ, గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, సన రాజేష్, కడకంచి వీరస్వామి, గడ్డి శ్రీను, మహమ్మద్ రబ్బు, కావేటి రమేష్, సామల రవితేజ, చాంద్ పాషా, వార రమేష్, ఇమ్రాన్, ములగుండ్ల ఉపేందర్, పొందూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ సందీప్ ను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ



**కొత్తగూడెం క్రైమ్, మార్చి 19, (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్ 1 పరీక్ష ఫలితాలలో 502.5 మార్కులను సాధించిన ఎస్సై సందీప్ ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇల్లందు పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ గ్రూప్ – 1 పరీక్షలకు హాజరయ్యి మంచి మార్కులు సాధించినందుకు గాను సందీప్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. సాధారణ వ్యవసాయ కుటుంబం నుండి వచ్చి ప్రస్తుత పోటీ ప్రపంచంలో మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా కష్టపడుతున్న ఎస్సై సందీప్ భవిష్యత్తులో మంచి విజయాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డిఎస్పి చంద్రభాను, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ బియ్యం పట్టివేత

**అశ్వారావుపేట, మార్చి 19, ప్రజాజ్యోతి:** అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ వ్యాన్ ను బుధవారం ఉదయం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. స్థానిక ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామం నుంచి బోలోరో వాహనంలో 10 బస్తాల్లో 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్ లోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం వైపు తరలిస్తుండగా, పక్క సమాచారంతో అశ్వారావుపేట ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో పట్టుకున్నారు. పట్టుబడిన వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించి సీజ్ చేశారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనం డ్రైవర్ దారం చిన్న శ్రీనివాస్, వాహన యజమాని ఆదివిష్ణుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాయతి రాజు తెలిపారు. అనంతరం పట్టుకున్న బియ్యాన్ని స్థానిక సివిల్ సప్లై అధికారులకు అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

## శ్రద్ధతో చదివితే విజయం సాధించడం సులభతరం

- **ప్రధానోపాధ్యాయుడు టివిఆర్ఎస్ స్వామి**



**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి :** విద్యార్థులు చదువును శ్రద్ధతో చదివితే జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సులభతరమని మండల విద్యాశాఖ అధికారి, మెయిన్ రోడ్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు టివిఆర్ఎస్ స్వామి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని మెయిన్ రోడ్డు హైస్కూల్ లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువును కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు ముఖ్యంగా సెల్ఫోన్ కు దూరంగా ఉండాలని, విద్యార్థుల నడవడికలపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రుల పర్యవేక్షిస్తూ ఉండాలని కోరారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకొని కన్న తల్లిదండ్రులు, పుట్టిన ఊరు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాలమేల సదస్సులో ఉత్తమ పాఠశాల ఎంపిక

# పారదర్శకంగానే జరిగిందా..?

- **ఎస్ఎంసి చైర్మన్ పూణేం లక్ష్మణ్**




**ఆళ్ళపల్లి.మార్చి19.ప్రజాజ్యోతి:** జిల్లా కలెక్టర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బాలమేల కార్యక్రమం లో మండల ఉత్తమ పాఠశాల ఎంపిక పారదర్శకంగా జరగలేదని లక్ష్మీపురం పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పూనెం లక్ష్మన్ అన్నారు. బుధవారం లక్ష్మీపురం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ. మంగళవారం పాత కొత్తగూడెం నందు కలెక్టర్ ఆదేశాల మేరకు బాలమేళా సదస్సు ఏర్పాటుచేసి మండలంలో ఉత్తమ పాఠశాల గా వలసల్లను ఎంపిక చేయడం జరిగిందని, ఎటువంటి మౌలిక వసతులు లేకపోయినప్పటికీ ప్రహరీ లేకపోయినప్పటికీ ఆ పాఠశాలను ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నించారు మండల కేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్మీపురం గ్రామ పాఠశాలలో అన్ని మౌలిక వసతులతో పాటు నూటికి నూరు శాతం ఉన్నప్పటికీ పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ ఉత్తమ పాఠశాల గా ఎంపిక చేయకపోవడం చాలా బాధాకరమన్నారు.ఉత్తమ పాఠశాల అనగా 1–5 తరగతులు ఉండాలని పాఠశాలలో అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలని విద్యార్థుల ప్రతిభ బాగుండాలని పాఠశాలలో పూల మొక్కలు చెట్లు కిచెన్ గార్డెన్ బాగుండాలని పాఠశాల పరిశుభ్రంగా ఉండాలి. యొక్క బాత్రూమ్స్ అన్ని శుభ్రంగా. అన్నిరకాల పాఠశాల చూడడానికి ఆహ్లాదకరంగా ఉండాలని అలా ఉంటేనే పాఠశాల ఉత్తమ పాఠశాలగా ఎంపిక జరుగుతుంది కానీ దానికి విరుద్ధంగా పైన చెప్పినటువంటి ఎటువంటి వసతులు లేనప్పటికీ వలసల పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ఏ ప్రాతిపదికన ఎంపిక చేయడం జరిగిందని అన్నారు పాఠశాలలో ఒకటి నుండి ఐదు తరగతులు లేవు పాఠశాలలో మొక్కలు లేవు పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లాంటివి ఏమీ లేవు బాత్రూమ్స్ సక్రమంగా లేవు సరైన పాఠశాల బోర్డు లేదు కూడా లేవు అదేవిధంగా అన్ని మౌలిక సదుపాయాలు ఆ పాఠశాలకు లేవు అటువంటి పాఠశాలను ఉత్తమ పాఠశాలగా ఎంపిక చేయడం. ఎంతవరకు సమంజసం అని అన్నారు. మండల విద్యాశాఖ అధికారి వివరణ కోరగా మండలంలో ఉన్న పాఠశాలలను పరిగణంలో తీసుకొని. వలసల్ల పాఠశాల విద్యార్థుల ప్రతిభను ఆధారంగా ఉత్తమ పాఠశాల ఎంపిక చేయడం జరిగిందని చెప్పారు.

## శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

- **భారతి ఫెర్టిలైజర్స్ అధినేత సతీమణి గౌరిశెట్టి విజయ లలిత**



**ఆళ్ళపల్లి. మార్చి19.ప్రజాజ్యోతి :** మండల కేంద్రానికి చెందిన భారతి ఫెర్టిలైజర్స్ అధినేత గౌరిశెట్టి శ్రీనివాసరావు సతీమణి విజయ లలిత ఆంజనేయ స్వామికి తమలపాకులు సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల ప్రజలు ఆరోగ్యంగా సుఖశాంతులతో ఉండాలని పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. భారతి ఫెర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ అధినేత గౌరిశెట్టి శ్రీనివాసరావు అభయాంజనేయ కమిటీ గౌరవ అధ్యక్షులు గా, విరాళాల సేకరణ కర్తగా, గౌరిశెట్టి శ్రీనివాసరావు ఉండడమే కాకుండా సామాజిక కార్యక్రమాల్లో భాగంగా ఆధ్యాత్మికత లో భాగంగా మహాన్నదానా కార్యక్రమాలు, ముస్లిం సోదరులకు రంజాన్ సమయంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేస్తూ కుల మతాల కతీతంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు ఈ నేపథ్యంలోనే మండల ప్రజలు ప్రశాంతంగా సుఖశాంతులతో వర్ధిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలోజు ముత్యమాచారి సౌందర్య, వల్లాల ఉమ నాగేశ్వర రాచారి, సిరినోముల శ్రీనివాసరావు పద్మావతి, భవాని నరేష్, బత్తిని శ్రీధర్, బోడకుంట బిక్షం స్వరూప, , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



**పాల్వంచ,మార్చి19, ప్రజాజ్యోతి :** ఉపాధి కూలీలకు వేసవిలో సకల సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్, డిఆర్డివో విద్యాచందన పేర్కొన్నారు.బుధవారం పాల్వంచ మండలంలోని కేశవాపురం గ్రామపంచాయతీలో జరుగుతున్న రోడు నిర్మాణం, నర్సరీ, కమ్యూనిటీ సోక్ ఫిట్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కూలీలతో మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఉదయం ఏడు గంటలకే పనుల వద్దకు రావాలని, 300రూపాయలు వచ్చే విధంగా కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. పనులు చేసిన వివరాలు జాబ్ కార్డు నందు తప్పకుండా పొందుపరచాలని,ప్రతి కుటుంబం కూడా 100 రోజులపాటు ఉపాధి హామీ పనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు,ఈ సందర్భంగా కూలీలు పలుగు, పార, తట్టలు లేక పని ఎక్కువ చేయలేకపోతున్నామని ఇప్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి, ఏపీవో పోరండ్ల రంగా, గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి క్షేత్ర సహాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం తెలపడం సంతోషకరం

**ఇల్లందు, మార్చి 19, ప్రజాజ్యోతి:** బీసీ కులగణన బిల్లుకు అసెంబ్లీలో ఏకగ్రీవ ఆమోదం తెలపడం సంతోషకరమని పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో ఇచ్చిన హామీ మేరకు, ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో ఇచ్చిన మాట ప్రకారం దేశంలోనే మొదటిసారిగా కుల గణన నిర్వహించి అసెంబ్లీలో 42 శాతానికి రిజర్వేషన్ పెంచుతూ ఏకగ్రీవ తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేది కేవలం కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, హరిహర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందే సదానందం, మాజీ మున్సిపల్ చైర్మన్ అనసూయ, సీనియర్ నాయకుడు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, నాయకులు సుదర్శన్ కోరి, యండి. జాఫర్, కొక్కు నాగేశ్వరరావు, వారా రవి, వచ్చా వెంకన్న, జెట్టి కిషోర్, సైదా మియా, పర్రె శ్రీనివాస్, ఎల్. కృష్ణ, గాలిపల్లి స్వరూప, కమలమ్మ, చెంచమ్మ, అనిత, ఇమామ్, శంకర్, సంగీత, చెట్టి సునీత, సరోజ, సరస్వతి, మడుగు వెంకటలక్ష్మి , జహీదా తదితరులు పాల్గొన్నారు.